


# కథ

## ఆదుర్తి బాల

# మార్పు

పాపారావుకి ఈమధ్యనే పెళ్లయింది. గిట్టని వాళ్లు అతడిని పి.పి.రావు అంటే పీనాసి పాపారావని ముద్దుగా పిలుచుకుంటారు. కానీ పాపారావు అందుకు ఒప్పుకోడు. తనది పొదుపరితనమే కానీ పీనాసితనం కాదని వాదిస్తాడు. అందుకే పి.పి.రావు అన్న పేరుని పొదుపు పాపారావుగా తనకి అన్వయించుకొని తృప్తిపడతాడు.

అతని భార్య సుబ్బలక్ష్మికి సరదాలెక్కువ. పల్లెటూర్లో పుట్టి పెరగడం మూలాన ఎక్కువగా చదువుకోకపోయినా, అద్దెషాపు నుండి బోలెడు నవలలు తెచ్చుకొని చదివి అందులో హీరో హీరోయిన్స్ లాగానే తను కూడా పెళ్లయ్యాక భర్తతో కలిసి సినిమాలకి షికార్లకి తిరగాలని లెక్కలేనన్ని కలలు కంది. అలా కోటి ఆశలతో, ఊహల పల్లకిలో ఊరేగుతూ కొత్తగా కాపురానికొచ్చింది.

పొద్దుటే తొమ్మిదింటికల్లా తయారై ఆఫీసుకెళ్లిపోవడం, సాయంత్రం ఐదవ్వగానే ఠంచనుగా ఇంటికొచ్చేయడం పాపారావు అలవాటు. భార్యకి ఓ మూరెడు మల్లెపూలు కూడా తెచ్చేవాడు కాదు అతడు. భర్త ఏనాడైనా నోరు తెరిచి 'సినిమాకెడదాం పదా' అంటాడేమో అని ఎదురుచూసింది సుబ్బలక్ష్మి. నెల రోజులు గడిచాయి గానీ పాపారావు నుండి అలాంటి ప్రపోజల్స్ ఏమీ రాకపోవటంతో విసుగెత్తి సినిమాకి తీసుకెళ్లమని తనే అడిగేసింది సుబ్బలక్ష్మి.

"ఓస్ అంతే కదా! సినిమా చూద్దానికి హాలుకే వెళ్లక్కర్లేదు. టీవీ పెట్టుకుంటే ఏదో ఓ ఛానల్లో ఏదొక సినిమా వస్తూనే ఉంటుంది. సుబ్బరంగా చూడు. ఈ సిటీలో సినిమాహాలుకెళ్లి సినిమా చూడడమంటే మాటలా- ఇద్దరు మనుషులెడితే,సినిమా టికెట్లే వంద రూపాయలవుతాయి. వెధవ మూడు గంటల భాగ్యానికి వంద రూపాయలు తగలెట్టడమెందుకు? పైగా మీ ఆడవాళ్లు కాలుబైట పెడితే చాలు ఆటో అంటారు. అదో వంద రూపాయలు. మొత్తం రెండొందలు ఎవరు తిన్నట్టు? ఆ రెండొందలకీ నెలకి సరిపడా కూరలు వచ్చేస్తాయి" అంటూ భార్యకి క్లాసు పీకాడు. భర్త నుంచి ఇలాంటి రెస్పాన్స్ వస్తుందని ఊహించలేదు సుబ్బలక్ష్మి.

"కొత్తగా పెళ్లయిన వాళ్లం. భార్యని సినిమాకి తీసుకెళ్లాలనీ హోటల్‌కి తీసుకెళ్లాలని మీకేం అనిపించదన్నమాట. మన ఎదురింటి సుజాతావాళ్లు చూడండి. సాయంత్రం అయ్యేసరికి చిలకాగోరింకల్లా తయారై స్కూటరెక్కి రోజూ ఎక్కడో చోటుకి పోతూనే ఉంటారు." అంది సుబ్బలక్ష్మి.

"ఆ కిషోర్‌గాడు జల్సారాయుడు. ఇలా వచ్చిన జీతమంతా జల్సాలకి తగలేస్తే అవసరమైనపుడు చేతిలో చిల్లిగవ్వ లేక ఏడుస్తాడు" అన్నాడు పాపారావు ఎదురింటి కిషోర్ భవిష్యత్తుని భయంకరంగా ఊహిస్తూ. ఇక ఎంత చెప్పినా భర్తవైఖరి మారదని అర్థమైంది సుబ్బలక్ష్మికి. చేసేదేం లేక అప్పటికి ఊరుకుంది.

మరోసారి పనిమనిషిని పెట్టుకుంటానని భర్తని అడిగింది సుబ్బలక్ష్మి. "ఉండేది ఇద్దరం మనుషులం. నాలుగు గిన్నెలు తోమడానికీ రెండు జతల బట్టలుతకడానికీ మళ్లీ పనిమనిషి కావాల నీకు. నీవసలే పల్లెటూరి దానివి. ఈ పట్నం పనిమనుషులలో దొంగలుంటారు. పనిచేస్తూనే ఇంటి గుట్టు కనిపెట్టి నేను లేని టైంలో వచ్చి ఇల్లు దోచుకుపోతారు. ఇలాంటి సంఘటనలు పేపర్లలో ఎన్ని చదవట్లేదూ! ఆ సంగతలా ఉంచు. అసలు ఇంటి పనిచేసుకోవడం నీలాటి గృహిణులకి మంచి ఎక్సర్‌సైజ్. పైగా పనిమనిషి జీతం ఆదా కూడా. ఇలా జాగ్రత్తగా దాచుకున్న డబ్బే చివరికి లక్షలవుతుంది" భర్త తత్త్వం అవగాహన అవుతున్న కొద్దీ సుబ్బలక్ష్మికి నీరసం వస్తోంది.

కొత్తగా పెళ్లయిందన్న మాటే గానీ ఓ సరదా లేదు, సరసం లేదూ. టైంటేబుల్ వేసినట్టు గడిచి పోయే రొటీన్ జీవితం - డబ్బు లెక్కలు తప్పితే భర్త నోటివెంట మరొకటి రావడం లేదు. తన ఫ్రెండ్సందరూ పెళ్లయ్యాక హనీమూన్ గురించి, వాళ్లాయన వాళ్ల కోసం కొన్న చీరల గురించి, బహుమతుల గురించి కథలుకథలుగా చెప్పేవాళ్లు తనకి. తనకా అదృష్టం లేదు అని నిట్టూర్చేది సుబ్బలక్ష్మి.

పొద్దున్నే లేచి భర్త ఆఫీసు టైం అయ్యేలోపు భోజనం, టిఫిన్ రెడీ చేయడం, అతడికి భోజనం పెట్టి క్యారియర్ సర్దివ్వడం, అతడు ఆఫీసుకెళ్లాక తను టిఫిన్ తిని బట్టలుతికి ఇంటిని శుభ్రం చేసుకోవడం, మధ్యాహ్నం భోంచేసి ఓ గంట నిద్రపోవటం, లేచాక భర్త వచ్చే వేళకి టిఫిను, టీ రెడీ చేయడం ఇదీ సుబ్బలక్ష్మి దైనందిన దినచర్య. రోజులు గడిచిపోతున్నాయి గానీ సుబ్బలక్ష్మి లైఫ్ స్టైల్ అలాగే ఉంది.

సుబ్బలక్ష్మికి పూలంటే చాలా ఇష్టం. పుట్టి పెరిగింది పల్లెటూర్లో. కాబట్టి పెరట్లో పూసిన సన్నజాజులు, మల్లెలు, కనకాంబరాలు కోసుకొచ్చి రోజూ దండలు కట్టి తల నిండా తురుముకునేది. సుబ్బలక్ష్మి సరదా చూసి "ఏవమ్మోయ్ రేపు నీ పెళ్లయి అత్తారింటికెడితే నీ మొగుడి సంపాదనంతా పూలఖర్చుకే సరిపోయేటట్టుంది" అని హాస్యమాడేది సుబ్బలక్ష్మి వదిన. గతం గుర్తొచ్చి భారంగా నిట్టూర్చింది సుబ్బలక్ష్మి. పాపం వదినకేం తెలుసు తన భర్త సంగతి! బారెడు పూలదండ కాదు కదా మూరెడు పూలు కూడా కొనుక్కురాడు పరమ పీనాసి. ఉడుక్కుంది సుబ్బలక్ష్మి.

ఆ రోజు పక్కింటావిడ గుమ్మంలోకొచ్చిన పూలు కొనుక్కుంటుంటే సుబ్బలక్ష్మికీ కొనుక్కోవాలనిపించింది. మూర రెండు చెప్తే ఐదు రూపాయలకి రెండు మూరలు బేరమాడి కొని భర్తొచ్చే టైముకి తల నిండా పూలు పెట్టుకుని తయారైంది. అలా మర్నాడు ఆ తరువాత రెండు రోజులూ వాడుకగా పూలు కొనుక్కుని పెట్టుకుంది సుబ్బలక్ష్మి. ఒక రోజు పూల గురించి అడగనే అడిగాడు పాపారావు. పక్కింటావిడ కొంటుంటే తనూ వాడుక పెట్టుకున్నానన్నది సుబ్బలక్ష్మి. "రోజూ ఐదు రూపాయలు పెట్టి పూలు కొంటున్నావా" అన్నాడు పాపారావు సీరియస్‌గా.

"ఐదు రూపాయలే కదండీ. ఏం మనమంత కొనుక్కోలేని వాళ్లమా - ఆ మాత్రం సరదా కూడా


వద్దా" తనూ కాస్త కోపంగానే అంది సుబ్బలక్ష్మి.

"ఒక్క రోజుకి ఐదు రూపాయలే. నెలకెంత అయిందో లెఖ్ఖ కట్టు" అన్నాడు పాపారావు.

"నూటయాభై"

"మరి సంవత్సరానికి"

సుబ్బలక్ష్మి కాసేపాలోచించి "పద్దెనిమిది వందలు" అంది.



"గంటలో వాడిపోయే పూలకి పద్దెనిమిది వందలు తగలేస్తున్నావ్ ఆలోచించుకో. కాస్త ఆలోచించి ఖర్చు పెట్టు లక్షలు మిగుల్చుకోవచ్చు" అన్నాడు పాపారావు. సుబ్బలక్ష్మికి బుర్ర వేడెక్కి తల్లో పూలు తీసి పాపారావు మొఖాన విసిరికొట్టి వెళ్లిపోయింది.

ఓ రోజు సుబ్బలక్ష్మి పక్కింటావిడ ప్లాస్టిక్ వైరుతో పూల కుండీలు అల్లడం చూసింది

సుబ్బలక్ష్మి. ముచ్చటగా ఉన్న అలాంటి కుండీలు తనూ అల్లి షోకేసులో పెట్టుకోవాలనిపించింది. ప్లాస్టిక్ వైరు కొనుక్కుంటానని భర్తని అడిగింది.

కయ్యిమని లేచాడు పాపారావు. అలాంటి అనవసర ఖర్చు పెడితే ఊర్కునేది లేదని కరాఖండిగా చెప్పేశాడు.

"నేను మా పుట్టింటికి వెళ్లొస్తాను ఇక్కడ విసుగ్గా ఉంది" అంది సుబ్బలక్ష్మి.

"నేనూ వస్తా పద నాకూ చాలా శలవులు మిగిలిపోయాయి. ఈ సిటీ రణగొణ ధ్వనులూ, పొల్యూషన్‌తో విసిగిపోయాను. హాయిగా నీ వెంట వచ్చి పల్లె

టూరి ప్రశాంత వాతావరణంలో స్వచ్ఛమైన పైరగాలి పీలుస్తాను" అన్నాడు పాపారావు.

"అసలు సంగతి అదికాదులెండి. ఈ పది రోజుల తిండి ఖర్చు మిగులుతుందని మీ సంగతి నాకు తెలీదా ఏమిటి" అనుకుంది సుబ్బలక్ష్మి.

పాపారావుకి కొత్తల్లుడి హోదాలో అత్తగారింట్లో మర్యాదలు ఘనంగానే జరిగాయి. రోజూ షడ్రసోపేతమైన భోజనం దక్కుతోంది పాపారావుకి.

"అల్లుడుగారూ - మొదటిసారిగా మా ఇంటికొచ్చారు. ఈ సందర్భంలో మీకు మోటారుసైకిల్ కొని కానుకగా ఇవ్వాలనుకుంటున్నాను" అన్నాడు సుబ్బలక్ష్మి తండ్రి.

ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బైపోయాడు పాపారావు. కానీ అతడి ఆనందం ఎక్కువసేపు నిలవలేదు.

"ఎందుకు నాన్నా ఇప్పుడీ అనవసర ఖర్చు" అంది సుబ్బలక్ష్మి.

"అల్లుడికి మామ కానుకలివ్వడం ఓ వేడుక. అందులో నాకు అనవసర ఖర్చు అనుకునేందుకేముందీ" అన్నాడు సుబ్బలక్ష్మి తండ్రి.

"నేనన్నది నీ ఖర్చు గురించి కాదు నాన్నా. మోటారుసైకిల్ వల్ల మాకయ్యే పెట్రోలు ఖర్చు గురించి. మీ అల్లుడుగారు ఆర్భాటాలకి దూరం. చాలా సింపుల్‌గా ఉంటారు. రోజూ ఆఫీసుకి బస్సులో వెళ్లి రావడమే ఆయన కిష్టం. ఆయన తల్చుకుంటే ఎప్పుడో ఓ హీరోహోండా కొనిపడేసే వాళ్లే! పెట్రోలుకే బోల్డంత అయిపోతుందని ఊర్కున్నారు గానీ కదండీ" అంది సుబ్బలక్ష్మి భర్త వంక చూసి.

భార్యని మింగేసేటట్టు చూశాడు పాపారావు.

పోనీ బంగారం ఉంగరమో, వాచీనో అయితే తీసుకుంటారేమో అల్లుడుగారు అన్నాడు సుబ్బలక్ష్మి తండ్రి.

ఆ మాటలకి పాపారావు ముఖం పద్మంలా వికసించింది.

"అవన్నీ పెళ్లిలో పెట్టేశారు కదు నాన్నా. పోనీ ఓ పని చేయండి ఆయనకిస్తే ఒకటి నాకిస్తే వేరొకటి కాదు కదా! మీరు ఇవ్వదలచుకున్నదేదో నాకు క్యాష్ ఇచ్చేయండి" అంది సుబ్బలక్ష్మి.

అలాగేనమ్మా అంటూ సుబ్బలక్ష్మికి ఓ పాతిక వేలు ఇచ్చాడు ఆమె తండ్రి. ఒంగి తండ్రి కాళ్లకి దణ్ణం పెట్టింది సుబ్బలక్ష్మి. నువ్వూ దణ్ణం పెట్టు వోయ్ అల్లుడూ ఆశీస్సులందుకో అంటుంటే కోపాన్ని అణచుకొని మామకి దణ్ణం పెట్టాడు పాపారావు.

తండ్రి ఇచ్చిన డబ్బులో ఓ ఇరవై వేలు పెట్టి గోల్డు చెయిన్ చేయించుకుంది సుబ్బలక్ష్మి. మిగిలిన ఐదు వేలు బ్యాంక్‌లో డిపాజిట్ చేసుకోమన్నాడు పాపారావు.

"ఆ డిపాజిట్లలో మీరు కడుతూనే ఉన్నారుగా ఈ డబ్బులు మన సరదాలకి వాడుకుందాం" అంది సుబ్బలక్ష్మి. అవి భార్య తాలూకు డబ్బులు కాబట్టి ఏమీ అనలేకపోయాడు పాపారావు.

"ఏమండి ఎగ్జిబిషన్‌కి వెడదాం. ఇవాళ త్వరగా వచ్చేయండి" అంది సుబ్బలక్ష్మి. ఖర్చయ్యేది తన డబ్బులే కాబట్టి పాపారావు ఒప్పుకున్నాడు. ఎగ్జిబిషన్ ప్రాంగణమంతా బాగా రద్దీగా కోలాహలంగా ఉంది. సుబ్బలక్ష్మి పుట్టింటి వారిచ్చిన డబ్బుతో చేయించుకున్న గోల్డు చెయిన్ వేసుకుని వచ్చింది. "ఇపుడా గొలుసు వేసుకు రాకపోతేనేం ఎంత రద్దీగా ఉందో చూడు. ఏ దొంగ వెధవో గొలుసు కాజేస్తాడు" సుబ్బలక్ష్మి ఇంటి దగ్గర బయలుదేరిన దగ్గర్నుండి ఆ గొలుసు వేసుకున్నందుకు చిరాకు పడుతూనే ఉన్నాడు పాపారావు.

"అబ్బా ఎవరూ కాజెయ్యరులెండి జాగ్రత్తగానే చూసుకుంటాను" అంది సుబ్బలక్ష్మి విసుగ్గా.

"ఈమధ్య దీనికి మొండితనం ఎక్కువైంది" అని భార్యని తిట్టుకొని భార్య వెనకాలే నడుస్తున్నాడు పాపారావు.

"ఏవండీ - ఆ హేండ్ బ్యాగ్స్ చూడండి ఎంత బాగున్నాయో - ఒక బ్యాగు కొనుక్కోనా" అంది సుబ్బలక్ష్మి.

"ఇక్కడన్నీ డబుల్ రేట్లు చెబుతారు. బీసెంట్‌రోడ్డు ఫుట్‌పాత్ మీదే అమ్ముతారు. బేరమాడితే సగం రేటుకి కూడా ఇస్తారు కూడా" అన్నాడు పాపారావు.

వరసగా స్టాళ్లన్నీ చూస్తూ నడు



## విమల అదృష్టం

తను నటించిన ఒక్క సినిమా కూడా చెప్పుకోదగిన హిట్ కాకపోయినా అవకాశాల్ని సంపాదించుకుంటోంది విమలారామన్. ఇటీవలే 'ఎవరైనా ఎపుడైనా' ద్వారా తెలుగు తెరకి కూడా వచ్చిన విమలారామన్ త్వరలోనే బాలీవుడ్‌కి కూడా వెళ్తోందిట. సైఫ్ అలీఖాన్ సరసన ఓ హిందీ చిత్రంలో హీరోయిన్ చాన్సు విమలని వెదుక్కుంటూ వచ్చిందని చెన్నయ్ సమాచారం. అతి తక్కువ కాలంలోనే హిందీ చిత్రసీమని సైతం ఆకట్టుకుందంటే అది విమల అదృష్టం కాక మరేమిటి చెప్పండి?

స్తోంది సుబ్బలక్ష్మి. పాపారావుకి మాత్రం సుబ్బలక్ష్మి గొలుసు ఎవరూ కాజెయ్యకుండా కాపలా కాయడమే సరిపోయింది.


"ఏమండీ బెంగాలీకాటన్ చీరలట చూద్దామా" అంది సుబ్బలక్ష్మి.

"ఒక్కసారి షాపులోకి చూడు గుంపులుగా ఎలా ఎగబడుతున్నారో జనం. అలాటి చోటే దొంగలుంటారు. "ఒద్దంటే వినకుండా గొలుసొకటి వేసుకొచ్చావు" అన్నాడు పాపారావు.

ఇంకాస్త ముందుకి కదిలాక తినుబండారాల స్టాల్స్ దగ్గిర కొచ్చారిద్దరూ.

"ఏమండీ మంచూరియా కావాలి" అంది సుబ్బలక్ష్మి. పాపారావుకి కూడా ఆకలి దంచేస్తోంది.

"సరే నే వెళ్లి తెస్తాగానీ నువ్విక్కడే ఉండు. జాగ్రత్త - అసలే కొత్త గొలుసు - ఆడదొంగలు కూడా ఉంటారు. ఓ చెయ్యి గొలుసు మీద వేసి ఉంచు" భార్యకి వంద హెచ్చరికలు చేసి ఇద్దరికీ చెరో ప్లేటూ మంచూరియా తెచ్చాడు. ఇద్దరూ మంచూరియా తింటున్నారు.




హఠాత్తుగా పాపారావుకేదో అనుమానం వచ్చింది. చుట్టూ ఉన్న మనుషులందరూ మూకీ సినిమాలాగా కనిపిస్తున్నారు. హావభావాలే గానీ మాట వినిపించడం లేదు. అసలు సంగతేంటంటే పాపారావుకి వినికిడి సమస్య వచ్చి వినికిడి బాగా తగ్గిపోతే డాక్టరు సలహా మీద ఇరవై వేలు పెట్టి బటన్ టైప్ హియరింగ్ మెషీన్ అమర్చుకున్నాడు రెండు చెవుల్లో. ఈ రద్దీలో అవెక్కడో పడిపోయాయి. లబోదిబోమన్నాడు పాపారావు.

'పోనీలెండి - మీలాగే వినికిడి సమస్య ఉన్న దొంగెవరో తన అవసరం కొద్దీ తప్పనిసరై కొట్టేసుంటాడు' అనుకుంది సుబ్బలక్ష్మి.

తన చుట్టూ ఉన్న సైలెంట్ ప్రపంచాన్ని భరించలేక మర్నాడే హియరింగ్ మిషన్స్ కొనుక్కొచ్చుకున్నాడు.

"అయ్యో ఇపుడీ ఇరవై వేలు పెట్టి కొత్త మిషన్లు కొనుక్కోపోతేనేం అయినా చెవులు వినిపించకపోవడం అనారోగ్యమేం కాదుగా. ఎదుటివారిని కాస్త పెద్దగా మాట్లాడమంటే సరిపోయేది కదా! ఆ ఇరవై వేలు ఏ బాంక్‌లోనో ఫిక్సడ్ చేస్తే మీరు రిటైరయ్యేనాటికి లక్షదాకా వస్తుంది. లెక్కలు తెలీని వారా ఏమిటి మీకు నేను చెప్పేందుకు."

అదను చూసి దెబ్బకొట్టిన భార్యనేమీ అనలేక పోయాడు పాపారావు.

"పొదుపు మంచిదే, అతి పొదుపు పీనాసితనమవుతుంది. జీవితమంటే లెక్కల పద్దు కాదు. చిన్న సరదాలూ జీవితంలో భాగమే. పరిమితి మించనంత వరకూ మనిషికి అన్నీ అవసరమే. ఒక రోజులోనే వాడిపోతాయి కదా అని పూవులు పూయడం మానేస్తున్నాయా. రోజూ తినేదే కదాని ఒక్క రోజైనా తినడం మానేస్తున్నామా చెప్పండి. రోజూ జీవించే జీవితమే అయినా ఆనందంగా గడపడానికి ప్రయత్నిద్దాం - ఆనందో బ్రహ్మ అన్నారందుకే" అర్థమైందనుకుంటాను అని చిన్న సైజు లెక్చరిచ్చింది సుబ్బలక్ష్మి.

సాలోచనగా భార్య వంక చూస్తూ తల పంకించాడు పాపారావు తనలో వస్తున్న మార్పుకి గుర్తుగా.

○



## మారిన త్రిష?

చూడ్డానికి అమాయకంగా కనిపించే త్రిష సాయంత్రాలు ఫ్రెండ్స్‌తో కలిసి డిస్కోతిక్‌లు, పబ్‌లకు వెళ్లి చేసే హడావుడి గురించి కొంత కాలంగా వార్తలు వస్తూనే వున్నాయి. పబ్బుల్లో త్రిష నానా హంగామా చేస్తుందని అసలు తనను తాను మరిచిపోతూ ప్రవర్తిస్తుందనీ రకరకాలుగా చెప్పుకుంటారు సినీజనాలు. ఇప్పుడు అదే సినీవాలాలు ఈమధ్య త్రిషలో వచ్చిన మార్పు గురించి చెప్పుకుంటున్నారు. పబ్బుల్లో చాలా కామ్‌గా వుంటూ ఇలా వచ్చి అలా వెళ్లిపోతోందిట త్రిష. ఎందుకో ఈ మార్పు?